RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 423 | 15 బుధవారం జూలై 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--




# అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు

## : రేవంత్ రెడ్డి



అభివృద్ధిని రాజకీయాలతో ముడిపెట్టకూడదని, రాజకీయాలు కేవలం ఎన్నికల సమయానికే పరిమితం కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏర్పాటుచేయనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు వరంగల్ కేంద్రంగా ఉంటుందని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు ఇతర పరిశ్రమల రాకతో నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున విమానాశ్రయం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి... కేంద్రమంత్రికి వివరించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయినందున వెంటనే టెండర్లు పిలిచి, 2028 జూన్ 2 నాటికి పనులన్నీ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధీనంలోని ఎయిర్‌పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయాన్ని కూడా నిర్మించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణా సంస్థలను (ఫ్లైయింగ్) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని కోరగా, దీనిపై తగిన ప్రతిపాదనలు అందజేయాలని కేంద్రమంత్రి సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రం చేయనంత వేగంగా తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు.

వరంగల్ కీలకం

ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండకు వరంగల్ కేంద్ర బిందువుగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. రైలు, రోడ్డు మార్గాలతో మెరుగైన అనుసంధానం ఉండటంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమలతో ఈ నగరం మరింత కీలకంగా మారుతుందన్నారు. రానున్న రోజుల్లో వరంగల్‌ను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలను కేవలం ఎన్నికలకే పరిమితం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

వివిధ అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తమకు సహకరిస్తోందని, ఏవైనా సమస్యలు ఉంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏదైనా సమాచార లోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని ఆయన వివరించారు.

---

ఊరూరా తిరిగి బీఆర్ఎస్ కుట్రలను

# ప్రజలకు తెలియజేస్తాం

## : పొన్నం ప్రభాకర్



కాళేశ్వరం ప్రాజెక్టు సంక్షోభం, రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సమస్యలపై బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి విరుచుకుపడ్డారు. నిన్న బీఆర్ఎస్ శ్రేణులు రక్తం ప్యాకెట్లతో సీఎం రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగిపోయిందని, దీనికి బీఆర్ఎస్ కారణమని ఆరోపించారు. ప్రతి గ్రామానికి వెళ్లి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఎన్‌డీఎస్‌ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజనీర్ల సలహాలను పాటిస్తామని తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. కరవును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు.

ఈ ఏడాది వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని తెలిపారు. కరవును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలుగా అంతర్గత సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలని, బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ సలహాలు ఇవ్వాలని కోరారు.

---

సింగరేణికి పట్టిన శని ఆ రెండు పార్టీలే..

# దోచుకుతిన్నారు

## : కిషన్ రెడ్డి



తెలంగాణకు గుండెచప్పుడు లాంటి సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు కలిసి నిలువునా ముంచేశాయని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. కేసీఆర్ కుటుంబం, కాంగ్రెస్ పాలకులు పోటీపడి మరీ సింగరేణిని తమ సొంత ఖజానాలా వాడుకున్నారని మండిపడ్డారు. కార్మికుల చెమట వాసన తెలిసిన సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టి, ఇప్పుడు దాని భవిష్యత్తును పూర్తిగా అంధకారంలోకి నెట్టేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సింగరేణి నుంచి బొగ్గు కొనుగోలు చేసి, విద్యుత్ వాడుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థకు చెల్లించాల్సిన బకాయిలను తుంగలో తొక్కిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం సుమారు రూ. 30 వేల కోట్ల బకాయిలు పెట్టిపోతే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానికి మరో రూ. 24 వేల కోట్లు జోడించిందని మండిపడ్డారు. ఇలా మొత్తం రూ. 54 వేల కోట్ల కార్మికుల కష్టార్జితాన్ని అప్పులపాలు చేసి, సంస్థను ఆర్థిక సంక్షోభంలోకి తోశారని ఆరోపించారు. కేసీఆర్ తన హయాంలో సింగరేణి బోర్డును ఉత్సవ విగ్రహంగా మార్చి, టెండర్ల పేరుతో భారీ దోపిడీకి పాల్పడ్డారని విమర్శించారు. రాజకీయాలు చేయడానికి తాను ఇక్కడికి రాలేదని, సింగరేణిని కాపాడుకోవడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గత పాలకులు సంస్థ ఆదాయాన్ని ఫుట్‌బాల్ మ్యాచ్‌లు వంటి అనవసరమైన వాటికి మళ్లించారని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ హయాంలో సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయించి కార్మికులకు అసలైన భరోసా కల్పించామన్నారు. సింగరేణి మనుగడ కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా కేంద్రం అండగా నిలబడుతుందని, కార్మికుల ప్రయోజనాలను కాపాడి తీరుతామని ఆయన హామీ ఇచ్చారు.

---

# కాళేశ్వరంపై కాంగ్రెస్-బీజేపీ కుమ్మక్కు..

## కేటీఆర్ సంచలన ఆరోపణలు



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ కలిసి కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసేందుకు కుమ్మక్కయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో ఆరోపించారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొంటున్న తరుణంలో, గోదావరి జలాలను ఉద్దేశపూర్వకంగానే సముద్రం పాలు చేస్తూ రైతులను ఇబ్బందుల్లోకి నెడుతున్నారని ఆయన మండిపడ్డారు. సోమవారం కరీంనగర్ జిల్లాలోని మిడ్ మానేరు జలాశయాన్ని సందర్శించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. వేల టీఎంసీల గోదావరి జలాలు వృథాగా సముద్రంలోకి వెళ్తున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు చొరవ చూపడం లేదని విమర్శించారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండిపోవడమే కాకుండా, హైదరాబాద్, కరీంనగర్ వంటి ప్రధాన నగరాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరికి వరద ప్రవాహం లేదంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నీటిని విజయవంతంగా ఎత్తిపోస్తోందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. మరమ్మతులు పూర్తయినప్పటికీ, కేవలం రాజకీయ దురుద్దేశంతో ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) నివేదికను సాకుగా చూపి తెలంగాణ ప్రభుత్వం నీటిని విడుదల చేయడం లేదని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ ప్రాజెక్టుకు చెడ్డపేరు తెచ్చేందుకే కాంగ్రెస్, బీజేపీలు కలిసి కుట్రలు చేస్తున్నాయని కేటీఆర్ ధ్వజమెత్తారు. ప్రభుత్వం తక్షణమే కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయకపోతే, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

---

# నితిన్ గడ్కరీతో భేటీ అయిన రేవంత్ రెడ్డి



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఫుల్ బిజీగా ఉన్నారు. కేవలం 20 రోజుల వ్యవధిలోనే ఆయర రెండోసారి ఢిల్లీకి వెళ్లడం గమనార్హం. ఈ ఉదయం కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని రేవంత్ కలిశారు. రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర (నార్త్) భాగం పనులకు వెంటనే కేబినెట్ ఆమోదం తెలపాలని, దక్షిణ భాగానికి పూర్తి అనుమతులు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర జాతీయ రహదారులను డ్రై పోర్టులతో అనుసంధానించే కొత్త దారులకు అనుమతులు ఇవ్వాలని విన్నవించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కూడా రేవంత్ కలవనున్నారు. తెలంగాణలో మూడు ఎయిర్ పోర్టులకు సంబంధించి చర్చించనున్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో కూడా ముఖ్యమంత్రి భేటీ కానున్నారు.

---

# కాంగ్రెస్ ప్రభుత్వానికి కళ్లు కనపడట్లేదా?

## : బండి సంజయ్



ప్రపంచమంతా చూస్తున్నా.. ఒవైసీ కళాశాల చెరువులో లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా నమ్మించే ప్రయత్నం చేస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. నిరుపేదల ఇళ్లను కూల్చడానికి ఉన్న ఉత్సాహం, అందరికీ కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్న ఈ భారీ ఆక్రమణలపై ఎందుకు చూపించడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డి సర్కార్‌కు నిజంగానే కంటిచూపు సమస్య ఉందా? లేక ఎంఐఎంతో ఉన్న రాజకీయ బంధం వల్ల ఆ సంకల్పం లోపించిందా? అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకుల కంటి జబ్బును నయం చేసేందుకు బీజేపీ కార్యకర్తలంతా కలిసి ఉచిత నేత్ర పరీక్ష శిబిరాలు నిర్వహించాలని బండి సంజయ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కళ్లు పరీక్షించాక కూడా అక్కడ చెరువు ఆక్రమణ కనిపించకపోతే, అది కంటి లోపం కాదని, కచ్చితంగా రాజకీయ లోపమేనని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ అవసరాలకు, ఓటు బ్యాంకు రాజకీయాలకు అనుగుణంగా ఎఫ్‌టీఎల్ పరిధి గీతలను ఇష్టమొచ్చినట్లు మారుస్తోందనే అనుమానాలు ఇప్పుడు ప్రజల్లో బలంగా వ్యక్తమవుతున్నాయన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని కాగితాల మీద చెప్పే ప్రభుత్వం... ఆచరణలో మాత్రం పేదలకు ఒక న్యాయం, అధికార పక్షానికి దగ్గరగా ఉండే ఎంఐఎం లీడర్లకు మరో న్యాయం చేస్తోందని దుయ్యబట్టారు. నచ్చిన వారిని వదిలేసి, నచ్చని వారిపై ఎంపిక చేసుకుని మరీ దాడులు చేయడం సరికాదని హితవు పలికారు. చెరువుల సంరక్షణ విషయంలో ప్రభుత్వం ఈ ద్వంద్వ వైఖరిని పక్కనబెట్టాలని డిమాండ్ చేశారు.

---

# మీనాక్షి నటరాజన్‌కు కడియం శ్రీహరిపై కొండా సురేఖ ఫిర్యాదు



తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య నెలకొన్న వివాదం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ వద్దకు చేరింది. మీనాక్షి నటరాజన్‌తో మంత్రి కొండా సురేఖ భేటీ అయి కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని, అనవసర వివాదాల్లోకి లాగుతున్నారని మీనాక్షి దృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరి మధ్య నెలకొన్న వివాదానికి సంబంధించిన అన్ని అంశాలను వివరించారు. సురేఖ వివరించిన అంశాలను ఓపికగా విన్న మీనాక్షి నటరాజన్ సంయమనం పాటించాలని సూచించారు. చిన్నచిన్న విషయాలను పెద్దగా పట్టించుకోవద్దని సలహా ఇచ్చారు. ఈ వివాదంపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి కడియంపై సురేఖ ఫిర్యాదు చేశారు.

## మహేశ్వరం పట్టణ కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో కళాశాలల బంద్ విజయవంతం నునావత్ రాజేష్

### ఏబీవీపీ రాష్ట్ర పిలుపుమేరకు మహేశ్వరం పట్టణ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పీజీ, కళాశాలలో బంద్

( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూలై 14:)
ఏబీవీపీ రాష్ట్ర పిలుపు మేరకు మహేశ్వరం ప్రభుత్వ కళాశాలల బంద్
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ ) రాష్ట్ర పిలుపు మేరకు మహేశ్వరం శాఖ ఆధ్వర్యంలో ఈరోజు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలను బంద్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ మహేశ్వరం నగర కార్యదర్శి నునావత్ రాజేష్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ. 11,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, నునావత్ రాజేష్,గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రటరీ రాఘవేంద్ర, ప్రణీత్, అభిలాష్, రోహిత్, రాహుల్,సాయికార్తిక్,ఉదయ్,కార్తీక్,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థుల సమస్యలను




పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో జాతీయ నూలు పురుగుల నిర్మూలన కార్యక్రమం

### – బీసీ గురుకులంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

( హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూలై 14:).



జాతీయ నూలు పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా ,కందుకూరు మండలం, బైరాయిగూడ గ్రామంలోని నిషిత క్యాంపస్ లో చంద్రాయన గుట్ట ,కందుకూరు , రాజేంద్రనగర్ కార్వాన్ బాయ్స్ విద్యార్థులకు సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ దీప చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లేమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి మాట్లాడుతూ, ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ప్రభుత్వం ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను అందజేస్తోందని తెలిపారు. నూలు పురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఎదుగుదలలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ మాత్రలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, కళాశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్టాఫ్ నర్స్ లు వైద్యులు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు నూలు పురుగుల నివారణపై అవగాహన కల్పించి, ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

## రంగారెడ్డి జిల్లా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులకు ఘనంగా సన్మానం

### దళిత, గిరిజన ప్రజల సమస్యల పరిష్కారం దిశగా పని చేయాలి

### అసైన్డ్ భూమి సమితి రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శ్రీనివాస్

( హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారిజులై 14:)
రంగారెడ్డి జిల్లాలో దళిత ఆదివాసుల సమస్యల పరిష్కారం కోసం విజిలెన్స్ కమిటీ పని చేయాలని అసైన్డ్ భూమి సమితి రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నాడు కొంగరకలాన్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మనిటరింగ్ కమిటీ సభ్యులు నియమితులు అయినా సందర్భంగా వారికి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు అసైన్డ్ భూమి సమితి రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శ్రీనివాస్ మాట్లాడుతూ వారి బాధ్యత గుర్తు చేస్తూ ఈ యొక్క కమిటీ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం 1995లో ఏర్పాటు దళిత గిరిజన సమస్యలే ప్రధానంగా ఎజెండగా పనిచేయాలని ఉద్దేశంతో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కమిటీ పూర్తిగా షెడ్యూల్ కులాల ప్రజల కోసం పనిచేయాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ సూపరింటెంట్ చంద్రశేఖర్, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ రంగారెడ్డి జిల్లా మెంబర్



బ్యాగరి రాజు, కొంకంటి విజవ్ కుమార్, కోరే యాదగిరి రావు, పెంటనోళ్ల నర్సిములు, లాక్ పతి నాయక్, కొట్టం సంపత్ కుమార్, గార్లపల్లి బాల్ రాజ్,సింగారం సుమన్, తదితరులు పాల్గొన్నారు

## సీఎం పర్యటన.. డ్రోన్లకు తాత్కాలిక నిషేధం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 14:-



తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జూలై 15న డ్రోన్లు, పారాగ్లైడర్లు, రిమోట్ కంట్రోల్డ్ మైక్రో-లైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తూ ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. భారతీయ నాగరిక భద్రతా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్-163 ప్రకారం ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతను మరింత కట్టుదిట్టం చేయడం, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఉగ్రవాద, సంఘవిద్రోహ శక్తుల నుంచి ఎలాంటి ముప్పు తలెత్తకుండా ఉండేందుకు ఈ నిషేధాజ్ఞలు జారీ చేసినట్లు వెల్లడించారు. నిబంధనలను ఉల్లంఘించి డ్రోన్లు లేదా ఇతర వైమానిక పరికరాలను వినియోగించిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు పోలీసు శాఖకు పూర్తిస్థాయిలో సహకరించి నిషేధాజ్ఞలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆదేశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్థానిక వార్తాపత్రికలు, ఆకాశవాణి, పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ అధికారులను ఆదేశించారు.

## ప్రతి బూతు లెవల్ అధికారి రోజుకి 150 ఎన్యూమరేషన్ ఫార్మ్స్ డిజిటల్ చేయాలి

### జిల్లా ఉపాధి కల్పన అధికారి జయ శ్రీ

హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 14
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జల్ పల్లి సర్కిల్ నందు ఓటర్స్ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని తనిఖీ చేసిన సర్ జల్ పల్లి సర్కిల్ ప్రత్యేకాధికారి మరియు రంగా రెడ్డి జిల్లా ఉపాధి కల్పనా అధికారి జయశ్రీ జల్ పల్లి సర్కిల్ లో శ్రీరామ్ కాలనీ, జల్ పల్లి లో పలు పోలింగ్ కేంద్రాల లో సర్ కార్యక్రమం జరుగుతున్న తీరుని పరిశీలించారు.. ప్రతి బూత్ లెవెల్ అధికారి ప్రతి రోజు 150 ఎన్యుమరేషన్ ఫార్మ్స్ డిజిటల్ చేయాలని, ఎన్యుమరేషన్ ఫార్మ్ నింపడం లో ఓటర్లకు సహాయం చేయాలని , ఫోన్ ద్వారా, సామాజిక మాధ్యమాలలో విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు! ఎట్టి పరిస్థితులలో కూడా 19 వ తేదీ లోపు 100% పూర్తి చేసేలా చూడాలని సూపర్వైజర్స్ ని మరియు బూత్ లెవెల్ అధికారులను ఆదేశించారు!! సర్ విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో జల్ పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మరియు ఏ ఈ ఆర్ ఓ బి. వెంకట్ రామ్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బి.వినయ్ కుమార్, సూపర్వైజర్స్




సత్యనారాయణ, శేషా రావు, శివ కుమార్, బూత్ లెవెల్ అధికారులు మధుసూదన్, దుర్గ, సుగుణ,సంధ్య, రేఖ , స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు!!

## గడ్డి అన్నారం మార్కెట్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 14:-
రంగారెడ్డి జిల్లా: గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్‌లో మంగళవారం విస్తృత స్థాయిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ యార్డులను పరిశుభ్రంగా ఉంచడం తమ ప్రధాన బాధ్యత అని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీలు, చెత్త పేరుకుపోయే ప్రాంతాలను పూర్తిగా శుభ్రం చేయించి, రైతులు, వ్యాపారులు, వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మార్కెట్‌కు వచ్చే ప్రతి ఒక్కరూ ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు బండి మధుసూదన్ రావు, మెగావత్ గణేష్ నాయక్, చెన్‌రెడ్డి రఘుపతి రెడ్డి, నాయకులు నవీన్, శేఖర్, సాయి, భార్గవ్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్రాల్లో ఖాళీ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి: సీపీఎం

### నిరుద్యోగులతో జూలై 15 మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 14:-
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూలై 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు డి. కిషన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఇంజాపూర్ ఆరోగ్య సంజీవిని పార్కులో ఎస్సై, కానిస్టేబుల్ తదితర ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డి. కిషన్ మాట్లాడుతూ దేశంలో యువశక్తి అధికంగా ఉన్నప్పటికీ ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీని అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10 లక్షలకు పైగా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు ప్రతి ఏడాది లక్ష ఉద్యోగాలు కల్పించలేదని, వెంటనే రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. పోలీస్ శాఖలోని 20 వేల ఖాళీలతో పాటు డీఎస్సీ, గ్రూప్-1, 2, 3, 4, జేఎల్, డీఎల్ తదితర ప్రభుత్వ శాఖల ఖాళీలను భర్తీ చేయాలని, నిరుద్యోగులకు నెలకు రూ.5 వేల భృతి



అందించాలని, పారదర్శక నియామకాల కోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆరెట్ల మాధవరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

### తులం బంగారం హామీ అమలు చేయాలని సబితా ఇంద్రారెడ్డి డిమాండ్


హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 14:-



మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ మండలం జల్‌పల్లి, బడంగ్‌పేట్ సర్కిళ్లలో మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రారంభించిన ఈ పథకాలు వేలాది కుటుంబాలకు ఉపయోగపడ్డాయని అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం కూడా అందిస్తామని హామీ ఇచ్చిందని, ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్నా ఆ హామీ అమలుకు నోచుకోలేదని ఆమె విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని తులం బంగారం పథకాన్ని వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఆర్. కృష్ణయ్య సత్యాగ్రహ దీక్ష

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 14:-
హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, పాత విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు విశేష స్పందన లభించింది. దీక్షకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సంఘీభావం ప్రకటించగా, బీసీ కుల సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచంద్ర యాదవ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. విద్యార్థులకు చెల్లించాల్సిన సుమారు రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేసి, గతంలో అమలులో ఉన్న విధానాన్నే



కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీక్షకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు, బీసీ సంఘాల ప్రతినిధులు, యువజన నాయకులు ర్యాలీగా తరలివచ్చి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు ఆర్కే సాయన్న ముదిరాజ్, బీసీ కులాల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొంటు



ముకుందం, ముఖ్య సలహాదారు పట్లూరి కృష్ణమోహన్, శేరిలింగంపల్లి నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సాయిలు, బీసీ యువజన నాయకుడు భేరి చంద్రశేఖర్ యాదవ్‌తో పాటు పలువురు బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, యువజనులు, విద్యార్థులు పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
15 బుధవారం జూలై 2026

# అర్ధరాత్రి ఆపద్బాంధవులైన పోలీసులు

## 100కు కాల్.. నిమిషాల్లో స్పందించి వృద్ధుడిని ఆస్పత్రికి తరలింపు



హనుమకొండ, జూలై 14 హైదరాబాద్ ఎస్టేట్: అర్ధరాత్రి వేళ బాత్రూంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిన ఓ వృద్ధుడికి పోలీసులు అత్యంత వేగంగా స్పందించి సకాలంలో ఆస్పత్రికి తరలించి సేవాభావాన్ని చాటుకున్నారు. హనుమకొండకు చెందిన కాందూరి రామానుజుల చారి (73), విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి, రాత్రి సుమారు 2 గంటల సమయంలో బాత్రూంకు వెళ్లి కాలుజారి కిందపడిపోయారు. కుటుంబ సభ్యులకు వెంటనే రవాణా సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో అత్యవసర సహాయం కోసం 100 నంబర్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే బీసీ2 హెడ్ కానిస్టేబుల్ జి. జయరాజు, కానిస్టేబుల్ సురేష్ కుమార్, కాకతీయ3 పోలీసుల సహకారంతో పోలీసు వాహనంలో ఘటనాస్థలికి చేరుకుని వృద్ధుడిని వెంటనే సిరి స్పెషాలిటీ క్లినిక్కు తరలించి చికిత్స కోసం చేర్పించారు. ఆపదలో ఉన్న వ్యక్తికి సకాలంలో అండగా నిలిచి మానవత్వంతో స్పందించిన పోలీసుల తీరును వృద్ధుడి కుటుంబ సభ్యులు అభినందించారు. తమ కుటుంబ సభ్యుడికి వెంటనే వైద్యసేవలు అందేలా చేసిన పోలీసు సిబ్బందికి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు భరోసాగా నిలుస్తూ, ఒక్క ఫోన్‌కాల్‌తో వేగంగా స్పందించి సేవలందిస్తున్న తెలంగాణ పోలీసుల ప్రజాసేవకు ఈ ఘటన మరో నిదర్శనంగా నిలిచింది.

# అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పది

## కమిటీ చైర్మన్ గండేటి కార్ భగవత్ జి



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్

అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని పూర్వకాలం నుండి సమాజంలో నేటి వరకు విరాజిల్లుతున్నది అని శ్రీశ్రీశ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్నప్రసాద వితరణ కమిటీ చైర్మన్ దండేటి కార్ భగవత్ జి(భగవాన్) అన్నారు . చైర్మన్ ఆధ్వర్యంలో గత 39 మాసాలుగా అమావాస్య రోజు అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు చంపాపేట్ నల్లపోచమ్మ ఎర్ర పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాని నిర్వహించారు. సుమారు 500 మందికి అన్న ప్రసాద వితరణ చేపట్టినట్లు తెలిపారు సహకరించిన దాతలు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవిముదిరాజ్,సుశీల్ కుమార్,సంతోష్ లడ్డ, , గణసాల వెంకటేష్ ( చింటూ),ఆడేళ్ల రాజా, అండేకార్ వెంకటేష్, టింగ్లికార్ రాజేష్, కంటేకర్ తిలక్ రాజ్, కంటేకర్ విట్టల్, జమాల్ పూర్ శివ.షానవాజ్ హుస్సేనీ, కర్నాటి మనోహర్, ఆడేళ్ల సంపత్, ఇట్టికల సాయికుమార్,ఆనగళ్ల జగదీష్, శ్రీను నాయక్, ఎడ్ల శివరామ్ రెడ్డి, రాదేకుమార్,గుర్రం పావని, ఎస్ సంజీవ్ కుమార్, తిప్పిరెడ్డి స్వాతి, డి సుభాష్, డి సతీష్, డి సందీప్, డి సూర్యన్స్, ఆకుల దీప, రేండ్ల సారయ్య, , కట్టెల మనోజ్, భవాని, సాత్తిరిమహేష్ , ఉపేందర్ చారి, కేకే సూర్య తేజ, ఎం దీపక్, మాడ కుట్నెస్, గాజుల నవీన్ కుమార్ , నల్ల దేవేందర్ , సాయి సాగర్ , విజయ్ కుమార్, కే రాము, ఎస్ సాయికుమార్, గూడ శ్రీనివాస్, అభిలాష్, జి సాయికుమార్, గోగిఖర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు

# పోల్కంపల్లిలో తాటి చెట్ల నరికివేత.. గీత కార్మికుల ఆవేదన



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 14:-

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామంలో తాటి చెట్ల నరికివేత వివాదానికి దారితీసింది. గ్రామంలోని 318 సర్వే నంబర్‌లో ఉన్న భూమిలో భూయజమాని తాటి చెట్లను నరికివేయించారని గీత కార్మికులు ఆరోపిస్తున్నారు. తమ జీవనాధారమైన తాటి చెట్లను తొలగించడం వల్ల గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లను నరికే ముందు గౌడ సొసైటీ సభ్యులను గానీ, కల్లుగీత కార్మికులను గానీ ఎవరూ సంప్రదించలేదని వారు తెలిపారు. అంతేకాకుండా అబ్కారి శాఖ అధికారులు కూడా తమతో ఎలాంటి చర్చలు జరపకుండా, అవసరమైన పంచనామా నిర్వహించకుండానే అనుమతులు ఇచ్చారంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాత్రి వేళలో ఎవరికీ తెలియకుండా చెట్లను నరికివేయడం వెనుక ఉన్న కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై స్పందించిన గీత కార్మికులు, తాటి చెట్లను నరికివేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత శాఖలు పారదర్శకంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారగా, అధికారుల స్పందన కోసం గీత కార్మికులు ఎదురుచూస్తున్నారు.

# విద్యార్థులకు యూనిఫామ్ అందజేత..




హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి ) మండల పరిధిలోని రామచంద్రపురం ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు మంగళవారం టీపీసి అధికార ప్రతినిధి అనపర్తి జ్ఞాన సుందర్ ఆయన సోదరుడు అనపర్తి శ్రీనివాస్ జ్ఞాపకార్థం విద్యార్థులకు సొంత ఖర్చులతో యూనిఫాం, షూస్, గేమ్స్ మెటీరియల్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో చదివి విద్యార్థులకు తమ వంతు ఆర్థిక సాయం ఎల్లప్పుడూ అందజేస్తానని వారికి తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేర్పించి మన ఊరు బడిని మనం కాపాడుకుందాం అని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ కాటా రవికుమార్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయుడు వంశీ, వాలంటీర్ మమత, సర్పంచ్ బోయిన శ్రీదేవి, ఉప సర్పంచ్ సువర్ణ వార్డు సభ్యులు వెంకటనారాయణ, చంద్ర కళ సైదయమ్మ, సోమలింగమ్మ కొమ్ము రవి నాయకులు తిరుమలేష్ జాన్ , యేసు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత భారత్‌కు జ్యూట్ బ్యాగుల ఉద్యమం

## మహిళలకు ఉచిత శిక్షణతో స్వయం ఉపాధి..

## పర్యావరణ పరిరక్షణకు సామూహిక భాగస్వామ్యం

## కేంద్ర పథకాల అమలులో పెరికె వరప్రసాదరావు కృషి అభినందనీయం

## : బీజేపీ మండల అధ్యక్షుడు కొంగర రవికుమార్

గీసుగొండ, జులై 14 హైదరాబాద్ ఎస్టేట్: ప్లాస్టిక్ రహిత భారత్ నిర్మాణమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమని, ఆ లక్ష్య సాధనలో ప్రతి కుటుంబం భాగస్వామి కావాలని జాతీయ టెక్స్టైల్ (జౌళి) బోర్డు సభ్యుడు పెరికె వరప్రసాదరావు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణహిత జ్యూట్ ఉత్పత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో శాయంపేటలో జ్యూట్ బ్యాగుల అవగాహన, ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల ఆర్థిక సాధికారతే దేశ అభివృద్ధికి బలమైన పునాది అని అన్నారు. మహిళలకు ఉచితంగా జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి మహిళకు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్లాస్టిక్‌కు బదులుగా జ్యూట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ గీసుగొండ మండల అధ్యక్షుడు కొంగర రవికుమార్ మాట్లాడుతూ, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ, స్వయం ఉపాధి లక్ష్యాలను ఒకే వేదికపై ప్రజల్లోకి తీసుకెళ్తున్న పెరికె వరప్రసాదరావు సేవలు ప్రశంసనీయమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్యపరచడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గాలి వినోద్



ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణం, ప్రజారోగ్యంపై కలిగే దుష్ప్రభావాలను వివరించారు. ప్రముఖ న్యాయవాది గోవిందు నాగభూషణం, కలకర్ల జ్యోతి, డ్వాక్రా సంఘాల మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగాల భర్తీయే నిరుద్యోగ సమస్యకు పరిష్కారం

## జులై 15 మహాధర్నాకు నిరుద్యోగ యువత భారీగా తరలిరావాలి

## : సీపీఎం జిల్లా నాయకుడు కారు ఉపేందర్

హనుమకొండ, జూలై 14 హైదరాబాద్ ఎస్టేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేసి, నిరుద్యోగ యువతకు ఉపాధి భరోసా కల్పించాలని సీపీఎం జిల్లా నాయకుడు కారు ఉపేందర్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగుల మహాధర్నాకు జిల్లాలోని నిరుద్యోగ యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హనుమకొండలోని న్యూ శాయంపేట సుర్జిత్‌నగర్లో మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఉపేందర్ మాట్లాడుతూ, ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి తదితర అంశాలపై ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఉద్యోగ




నోటిఫికేషన్ల కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న నిరుద్యోగులపై కేసులు నమోదు చేయడం బాధాకరమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాల కల్పనపై ఇచ్చిన హామీలను అమలు చేసి కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ, గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, పోలీసు శాఖతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేసి పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని కోరారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడం, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అమలు చేయడం, ఉద్యోగాలు లభించే వరకు నిరుద్యోగులకు భృతి అందించడం వంటి హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ల కోసం ఏళ్ల తరబడి సిద్ధమవుతున్న లక్షలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తును ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయవద్దని ఉపేందర్ అన్నారు. ఉద్యోగాల భర్తీ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ధర్నా ప్రభాకర్, పెండ్యాల లక్ష్మణ్, ఇనుముల వనమాల, కురుకు రజిత, కావటి కేతమ్మ, షర్ఫుద్దీన్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కురుకు రంజిత్, దావుపాటి వెంకన్న, కొండ యాకయ్య, పిడుగు రేణుక తదితరులు పాల్గొన్నారు.

# కుల రాజకీయాలు వద్దు – ముద్దగౌని రామ్మోహన్ గౌడ్

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి రంగారెడ్డి జూలై 14 :

కుల రాజకీయాలు, చేస్తున్న కొందరు:తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారం పూర్తిగా రాజకీయ కుట్రలో భాగమేనని మాజీ పీసీసీ కార్యదర్శి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ స్పష్టం చేశారు. అన్ని కులాలకు సమాన గౌరవం ఇవ్వడమే తన రాజకీయ జీవితానికి మూల సూత్రమని, తన రాజకీయ ప్రస్థానమే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వీడియోలో తన పేరును ప్రస్తావిస్తూ గౌడ్ సామాజిక వర్గాన్ని కించపరిచేలా తాను వ్యాఖ్యలు చేశానంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు.ఈ వ్యవహారంలో జక్కిడి ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. తన రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతో కొందరు కావాలనే కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేయడంతో పాటు



పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. తన రాజకీయ జీవితంలో ఏ సందర్భంలోనూ ఏ కులాన్ని అవమానించేలా మాట్లాడలేదని, అలాంటి ఆలోచన కూడా తనకు లేదని రామ్మోహన్ గౌడ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలోనే తన రాజకీయ జీవితం ప్రారంభమైందని, రాజకీయాల్లో ఉన్నంతకాలం కుల, మత భేదాలకు అతీతంగా ప్రజాసేవకే ప్రాధాన్యం ఇచ్చానన్నారు.

జక్కిడి ప్రభాకర్ రెడ్డితో చాలా కాలంగా రాజకీయ పరిచయం ఉందని, ఒకే పార్టీలో కలిసి పనిచేసిన సందర్భాలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు తన పేరును ఉపయోగించి గౌడ్ సమాజంలో తనపై లేనిపోని అపోహలు సృష్టించే ప్రయత్నం చేయడం బాధాకరమన్నారు. తన పేరును అడ్డం పెట్టుకుని సమాజంలో తన ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ ప్రచారం జరుగుతోందని ఆరోపించారు.గత ఎన్నికల సమయంలో కూడా తనపై ఇలాంటి అసత్య ప్రచారాలు జరిగాయని, తాను ఒక వర్గానికి వ్యతిరేకమని, ఎమ్మెల్యేగా ఎన్నికైతే మరో వర్గాన్ని అవమానిస్తానంటూ తప్పుడు ప్రచారం చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం కూడా గౌడ్ సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని అదే తరహాలో మరోసారి దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గౌడ్ సమాజంపై తనకు ఎల్లప్పుడూ గౌరవభావమే ఉందని, భవిష్యత్తులో కూడా అదే కొనసాగుతుందని రామ్మోహన్ గౌడ్ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మకుండా, వాస్తవాలను గుర్తించి స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 14:-

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత మెరుగుపరచేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డితో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో నియోజకవర్గంలోని ఆస్పత్రుల పనితీరు, వైద్య సదుపాయాలు, సిబ్బంది కొరత, మౌలిక వసతులపై విస్తృతంగా చర్చించారు. ఆస్పత్రుల్లో అవసరమైన సౌకర్యాలు, వైద్యులు, సిబ్బంది నియామకం, పరికరాల లభ్యతకు సంబంధించిన పూర్తి నివేదికను శనివారంలోగా సమర్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని, అవసరమైన నిధులు ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రిని సూపర్ స్పెషాల్టీ స్థాయికి తీర్చిదిద్దే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా చూడాలని, రోగులు బయట మందులు కొనుగోలు చేసే పరిస్థితి రాకూడదని అధికారులను ఆదేశించారు.

డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది సమయపాలన పాటిస్తూ సేవలందించాలని, అత్యవసర సమయాల్లో వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సీజనల్ వ్యాధుల నివారణ, గర్భిణులకు మెరుగైన సేవలు, సాధారణ



ప్రసవాల ప్రోత్సాహం, బస్తీ దవాఖానాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
15 బుధవారం జూలై 2026

# జర్నలిస్టుల పిల్లలకు కేజీ టు పీజీ ఉచిత విద్య

## - టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్ జూలై14

తెలంగాణలో అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా జర్నలిస్టుల పిల్లలకు కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, వివిధ పత్రికలు, చానళ్ళల్లో పని చేస్తున్న అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, తమ పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదించుకోలేక పోతున్నారని అన్నారు. జర్నలిస్టుల ఆర్థిక



స్థితిగతునలను దృష్టిలో పెట్టుకొని వారి పిల్లలకు అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందించేందుకు ప్రభుత్వం జీవో జారీ చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా అన్ని గురుకుల విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు సీట్ల కేటాయింపులో ప్రత్యేక కోటా ఇవ్వాలని మామిడి సోమయ్య విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల పిల్లలకు గురుకులాల్లో ప్రత్యేక కోటా

జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్య అందించే విషయాన్ని పరిశీలిస్తామని ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా అన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ఏ రాష్ట్రంలోనైనా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యను ఇస్తున్నట్లయితే దాని వివరాలు ఇవ్వాలని ఆమె ఫెడరేషన్ ప్రతినిధులను కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిశీలిస్తానని చెప్పారు. రాష్ట్రంలో అత్యుత్తమంగా నడుస్తున్న గురుకుల విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ప్రత్యేక కోటా కింద సీట్లు ఇస్తామని ఆమె హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాకార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కుంచెం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వి. రవికుమార్ తదితరులున్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే సామేల్ జన్మదిన వేడుకలు



హైదరాబాద్ స్టేట్ మద్దిరాల (ప్రతినిధి )

మండల కేంద్రంలోకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పచ్చిపాల వెంకన్న యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మందుల సామేల్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు మద్దిరాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పచ్చిపాల వెంకన్న యాదవ్ ఆధ్వర్యంలో తుంగతుర్తి నియోజకవర్గ శాసనసభ్యులు మందుల సామేల్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.నాయకులు ఎమ్మెల్యే మందుల సామేల్ కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి వారి ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు

# మాదక ద్రవ్యాల నిర్మూలనకు సమాజమంతా కదలిరావాలి

## : మంత్రి కొండా సురేఖ





హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి
హనుమకొండ, జూలై 12:

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలు అత్యంత అవసరమని మంత్రి పేర్కొన్నారు.తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయూ) హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న నిర్వహించనున్న 'సే నో టు డ్రగ్స్' 2కే అవగాహన ర్యాలీ పోస్టర్‌ను మంత్రి కొండా సురేఖ ఆదివారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల వినియోగం యువత జీవితాలను నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, మీడియా, విద్యాసంస్థలు, ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. సామాజిక బాధ్యతతో టీఎస్‌జేయూ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ర్యాలీ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

టీఎస్‌జేయూ రాష్ట్ర అధ్యక్షులు నారగౌని పురుషోత్తం మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలపై నిరంతర అవగాహన ద్వారానే యువతను రక్షించగలమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్ మాట్లాడుతూ, సమాజంలో చైతన్యం పెంపొందించేందుకు జర్నలిస్టులు తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తారని తెలిపారు.

జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి హరికృష్ణ, జిల్లా కోశాధికారి సల్మాన్ ఖాన్ మాట్లాడుతూ, జూలై 23న నిర్వహించే 2కే ర్యాలీలో విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, జర్నలిస్టులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ రాష్ట్ర, జిల్లా నాయకులు వేణు , నగేష్ గౌడ్ , నరేష్ గౌడ్ , వరంగల్ జిల్లా కమిటీ ఈద శ్రీనాథ్ ,నాగపురి అవినాష్ , కౌడగాని మోహన్ రావు ,తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక, గుజరాత్‌కు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం స్వాధీనం



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 14:- రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ (ఈటీఎఫ్) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు నిర్వహించిన దాడుల్లో సుమారు 900 క్వింటాళ్ల రేషన్ బియ్యం గోదాంలో నిల్వ ఉంచినట్లు గుర్తించారు. ఈ బియ్యాన్ని తెలంగాణ నుంచి కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలకు అక్రమంగా ఎగుమతి చేసేందుకు సిద్ధం చేసినట్లు ప్రాథమిక విచారణలో అధికారులు గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వం పేదల కోసం అందించే పీడీఎస్ బియ్యాన్ని సేకరించి ఇతర రాష్ట్రాలకు తరలించే అక్రమ రాకెట్‌పై అధికారులు దృష్టి సారించారు. ఈ వ్యవహారంలో మొత్తం ఎనిమిది మందిపై కేసులు నమోదు చేయగా, నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన నలుగురు నిందితులు పరారీలో ఉండటంతో వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో సీజ్ చేసి భద్రపరిచారు. ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న నెట్‌వర్క్, బియ్యం సేకరణ, రవాణా మార్గాలు, ఇతర రాష్ట్రాలతో ఉన్న సంబంధాలపై దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన ధాన్యాన్ని దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సర్ ప్రక్రియ వేగవంతం



హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిది )

మండల కేంద్రంలో సర్ ప్రక్రియ ఊపొందుకున్నదని స్థానిక బిఎల్ఓ లు తెలియజేయడం జరిగినది అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సర్ ఫారం నింపి నిర్ణీత గడువులోగా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల పార్టీ అధ్యక్షులు కొడిశాల లింగయ్య మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ స్ట్రగుల్ కమిటీ 15న చలో ఈపీడీసీఎల్ సీఎండి ఆఫీసు ను ముట్టడి.. ఏపీ విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ పిలుపు

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై జులై 15న ఏపీ ఈపీడీసీఎల్ సీఎండి సామూహిక వినతి పత్ర కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అనకాపల్లి జిల్లా విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ ఈరోజు సిఐటియు కార్యాలయంలో గోడపత్రిక ఆవిష్కరించడం జరిగింది.

కేంద్ర బిజెపి ప్రభుత్వం రాష్ట్ర టిడిపి కూటమి ప్రభుత్వం విద్యుత్తు ఉద్యోగులను, కాంట్రాక్ట్ కార్మికులను మోసగిస్తుందని పిఆర్సి వెంటనే వేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగ భద్రత లేక కనీసం పక్క తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చినట్లుగా 48 వేల రూపాయల బేసిక్ ను కూడా అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులను మోసం చేస్తుందని అన్నారు. సమాన పనికి సమాన వేతనం కోసం, రెగ్యులరైజేషన్ కోసం పోరాటం తప్ప మరో మార్గం లేదని దశల వారి పోరాటంలో భాగంగా జులై 15న విశాఖపట్నంలోని ఈపీడీసీఎల్ సిఎండి కార్యాలయం వద్దకు విద్యుత్ ఉద్యోగులు అందరు చేరుకొని జయప్రదం చేయాలని వారు కోరారు.

ప్రేమ చంద్రశేఖర్ , సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వ్యాపాడ సత్యనారాయణ, ఎస్ సత్యారావు, అనకాపల్లి డివిజన్ అధ్యక్షులు పి శ్రీనివాసరావు, నర్సీపట్నం డివిజన్



అధ్యక్షులు ఎస్ రమేష్, సీనియర్ నాయకులు జమీల్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్ అవతారం, కె. రాజేష్, కె పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# శివయ్యకు జలాభిషేకం చేసిన గట్టుపల్లి గ్రామస్తులు



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 14

రంగారెడ్డి జిల్లామహేశ్వరం నియోజకవర్గం గట్టుపల్లి గ్రామస్తులు వర్షాలు కూరవాలని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం లో ఉన్న శివ లింగానికి జలాభిషేకం చేశారు. గత నెల రోజులుగా వర్షాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వేసిన విత్తనాలు మొలకెత్తి వాడి పోతున్నా యని ఆ భగవంతుడు కరుణించి వర్షాలు కురిపించాలని గ్రామం లోని యువకులు అందరు సర్పంచ్ ఎర్ర శంకరయ్య ప్రోత్సాహం తో ఆ శివయ్య కు జలాభిషేకం నిర్వహించారు. ఇప్పటినుంచైనా వర్షాలు విరివిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకొన్నారు ఆ శివయ్య కరుణించి గంగమ్మ ను భూమిపైకి పంపించాలని వేడుకొన్నారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ ఎర్ర శంకరయ్య ఉప సర్పంచ్ ఏనుగొండ ఆంజయ్య యాదవ్ సాయి పంతులు శ్రీసైలం సేటు శివకుమార్ ఏనుగొండ శేఖర్ యాదవ్ ఎర్ర శేఖర్ జనార్దన్ రెడ్డి శ్రీనివాస రాజు గోవర్ధన్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి ఏనుగొండ వెంకటేష్ యాదవ్ బైకని అంజయ్య యాదవ్ బట్టు జంగయ్య యాదవ్ కుమ్మరి కుమార్ శ్రీనివాస్ యాదవ్ వెంకటేష్ యాదవ్ బుచ్చప్ప భక్తులు పాల్గొన్నారు

# బెస్ట్ సోషల్ వర్కర్‌గా సర్వేజనా ఐక్యవేదిక వ్యవస్థాపకులు కోరుబిల్లి పరమేశ్వర జగన్నాథరావు (పరి)కి ఘన సన్మానం

లాభాపేక్షలేని ప్రపంచ ప్రఖ్యాత సామాజిక సేవా సంస్థ రోటరీ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ అయిన రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో ఆధ్వర్యంలో విశాఖపట్నం బీచ్ రోడ్డులోని అంబికా సీ గ్రీన్ హోటల్లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో సర్వేజనా ఐక్యవేదిక వ్యవస్థాపకులు కోరుబిల్లి పరమేశ్వర జగన్నాథరావు (పరి)ను "బెస్ట్ సోషల్ వర్కర్" పురస్కారంతో సత్కరించారు.ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో అధ్యక్షురాలు సీఏ శ్రీవల్లిక అధ్యక్షత వహించగా, సెక్రటరీ ఒమ్మి కిరణ్ కుమార్ సమన్వయం చేశారు. ముఖ్య అతిథులుగా బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు పరశురామ్ రామరాజు, ఏకేఎస్ సీఏ రవి వడ్లమని, ప్రభుత్వ ఛెస్ట్ అండ్ సీడీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. సునీల్ కుమార్, జీఎస్ రాజు, ప్రముఖ సామాజికవేత్త నంద కిషోర్ పాల్గొని కోరుబిల్లి పరమేశ్వర జగన్నాథరావు (పరి)కి అవార్డు, శాలువా, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, సమాజ శ్రేయస్సు కోసం కోరుబిల్లి పరమేశ్వర జగన్నాథరావు (పరి) ఎన్నో సంవత్సరాలుగా నిస్వార్థంగా సేవలందిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. సామాజిక సేవ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని గుర్తించి "బెస్ట్ సోషల్ వర్కర్" అవార్డును ప్రదానం చేయడం ఆనందంగా ఉందన్నారు.అవార్డు అందుకున్న కోరుబిల్లి పరమేశ్వర




జగన్నాథరావు (పరి) మాట్లాడుతూ, తన సేవలను గుర్తించి ఈ ప్రతిష్ఠాత్మక గౌరవాన్ని అందించిన రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తనలో మరింత సేవా స్ఫూర్తిని నింపిందని, భవిష్యత్తులో కూడా ప్రజా సంక్షేమం కోసం మరింత అంకితభావంతో సేవలు కొనసాగిస్తానని పేర్కొన్నారు.రోటరీ క్లబ్ వైజాగ్ మెట్రో 2006లో స్థాపించబడిన రోటరీ ఇంటర్నేషనల్‌కు చెందిన ప్రముఖ సేవా సంస్థ. రోటరీ డిస్ట్రిక్ట్3020 పరిధిలో పనిచేస్తున్న ఈ క్లబ్ మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ, రోడ్డు భద్రత అవగాహన, ఉచిత వైద్య శిబిరాలు, యోగా, యువత అభివృద్ధి వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ సమాజాభివృద్ధికి విశేష కృషి చేస్తోంది.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
15 బుధవారం జూలై 2026

## నేడు మహా శైవక్య యోగం.. 225 సంవత్సరాలలో కేవలం 9సార్లు మాత్రమే



సోమవారం నేడు మహా శైవాక్య యోగం ఇలాంటి రోజు 225 సంవత్సరాల లో తొమ్మిది సార్లు మాత్రమే వచ్చిందని అలాంటి మహిమాన్వితమైన రోజు ఈ సోమవారం అని పండితులు తెలిపారు. సోమవారం ఆరుద్ర నక్షత్రం మాస శివరాత్రి సందర్భంగా ఈ మహిమాన్వితమైన రోజుని పురస్కరించుకొని నియోజకవర్గంలోని శివాలయాల్లో వేకువ జాము నుండే అభిషేకాలు విశేష పూజలు స్వామివారికి జరిపించబడ్డాయి. అనకాపల్లిలో స్వయంభూగా వెలసిన భోగ లింగేశ్వర స్వామి దేవస్థానం, వేల్పుల వీధిలో వెలసిన కాశీ విశ్వేశ్వర ఆలయము ఇతర శివాలయాల్లో కశింకోట మండలంలోని శివాలయాల్లోనూ ఈ పూజలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలు శివనామ స్తోత్రం తో ఓం నమశ్శివాయ ఓం నమశ్శివాయ అంటూ భక్తుల శరణు ఘోషతో హోరెత్తాయి.ఈ సందర్భంగా కాశీ విశ్వేశ్వర ఆలయ అర్చకులు శాస్త్రి మాట్లాడుతూ వంద మహాశివరాత్రుల ఫలితం ఈ ఒక్కరోజు ఈ మాస శివరాత్రి నాడు ఆ శివ పూజ చేస్తే అంత పుణ్యం వస్తుందని అన్నారు. ఈరోజు స్వామిని పూజించి తరించిన వారు ఉద్యోగ దాంపత్య సంతాన సమస్యలు శత్రుభాధలు తొలగితాయి అన్నారు.

## గాయపడ్డ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి....

### ఫార్మాసిటీ స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గనిశెట్టి




ఫార్మా సిటీలో టోరెంట్ ఫార్మా పరిశ్రమలో సల్ఫ్రిక్ యాసిడ్ పడి ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. ఎన్. నాగరాజు కెమిస్ట్ ముఖంపై కుడి భుజం పైన కాలిన గాయాలయ్యాయి. దీనిపై సమగ్ర విచారణ చేసి గాయపడ్డ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం తెల్లవారు జరిగిన ఈ ప్రమాదంలో సల్ఫ్రిక్ యాసిడ్ ఫస్ట్ ఫ్లోర్ కి కింది నుండి చైన్ సహాయంతో ఫస్ట్ ఫ్లోర్ కి తరలిస్తుండగా ఒక్కసారిగా చైన్ తెగిపోవడంతో ఒక్కసారిగా డ్రమ్ము కిందపడి పగిలిపోయింది. దీంతో పక్కనే ఉన్న నాగరాజు మరో కార్మికులకు గురయ్యారు. దీనిపై సమగ్ర విచారణ చేసి చర్యలు చేపట్టాలని గని శెట్టి డిమాండ్ చేశారు.

## ప్రమాదంలో గాయపడిన మత్స్యకారుడిని పరామర్శించిన .... సుందరపు



నియోజకవర్గంలోని అచ్యుతాపురం మండలం పూడిమడక సముద్ర తీరంలో వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు ప్రమాదానికి గురయ్యాడు.వేట సాగిస్తున్న సమయంలో బోటు ఇంజిన్‌లోని ఇనుప భాగం విరిగి అతని చేతికి తగలడంతో స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం ఆయనను చికిత్స నిమిత్తం వడ్లపూడిలోని పవన్ సాయి హాస్పిటల్‌కు తరలించారు.ప్రమాదంలో గాయపడిన పూడిమడక గ్రామానికి చెందిన పైడికొండను ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు..బాధితుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు...

## హౌసింగ్ బోర్డు అధికారులతో సమీక్ష నిర్వహించిన కొణతాల రామకృష్ణ



మాజీ మంత్రివర్యులు, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్య బాబు , హౌసింగ్ బోర్డు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హౌసింగ్ బోర్డుకు సంబంధించిన పలు అంశాలు, అమలులో ఉన్న పథకాలు, పెండింగ్ పనులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించే అంశాలపై సమగ్రంగా చర్చించారు. హౌసింగ్ పథకాల అమలులో వేగం పెంచడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, హౌసింగ్ బోర్డు కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## నిజం నిప్పులాంటిది

నేను....
నేను నిజం మాత్రమే మాట్లాడి నీతికి నిల్చుంటుంటే చుట్టూ ఉన్నవారికి ఎంతో కోపం ,ద్వేషం, ఈర్ష్య ,పగ
సత్యానికి రంగు భూషి అబద్దాన్ని అందంగా చెప్తే ఓహో!! తెలిసినవాడు తెలివైనవాడు అంటుంది ఈలోకం !
అందుకే నేను సత్యాన్ని మరువలేక అబద్ధం జోలికి పోక మౌనంగా నిలుచుంటున్నాను మానవతను గాలిస్తున్నాను నేను....!

దుర్గం వివేక్ ప్రేమ్ రత్నం
సబ్ ఎడిటర్,
హైదరాబాద్ ఎస్టేట్.
( తెలుగు దినపత్రిక )

ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు బైరామల్‌గూడ ఫ్లైఓవర్ కింద ఏర్పాటు చేసిన ఆట స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఆడుకుంటున్న చిన్నారులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన సుధీర్ రెడ్డి గారు వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, “చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటాను. ఆట స్థలంలో అవసరమైన సౌకర్యాలు కల్పించి, పిల్లలు సురక్షితంగా ఆడుకునేలా చర్యలు తీసుకుంటాం” అని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి215 జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్



పీజీఆర్ఎస్ అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ మందిరంలో ప్రజా పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ తో , పాటు ఇంచార్జ్ డిఆర్ఓ వై శ్రీనివాస్ రావు లు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల నుంచి వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా రెవిన్యూ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఏడి సర్వే, ఇరిగేషన్, జీవీఎంసీ, ఏడి అగ్రికల్చర్, మైనింగ్, ట్రైబల్ వెల్ఫేర్, లేబర్ ఆఫీస్, ఫిషరీస్, ఏపీఎస్ ఆర్టీసీ, డ్వామ, తాగునీరు తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన అర్జీలను కేవలం సమస్యలను పరిష్కరించడమే ముఖ్యం కాదని, ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందేలా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండకూడదని, గడువు ముగియక ముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వివిధ శాఖలలో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ అమలు పనితీరుని శాఖల వారిగా జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ-ఆఫీస్ తప్పనిసరిగా అమలు చేయాలని, సిబ్బంది అందరికి లాగిన్ ఉండాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. వాట్సాప్ గవర్నన్స్ పై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు.

ఫిర్యాదులను తిరస్కరించాల్సి వస్తే, దానికి సరైన కారణాలను తెలియజేస్తూ ఫిర్యాదుదారునికి లిఖితపూర్వక సమాచారం ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పెండింగ్ అర్జీలు అధికంగా ఉన్న శాఖల అధికారులకు ప్రత్యేక సూచనలు జారీ చేస్తూ, సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 215 అర్జీలు అందాయి. అదేవిధంగా రెవెన్యూ క్లినిక్ కు 242 వినతులు అందాయి.

ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# సమాచార హక్కు చట్టం అమలు

### – రికార్డుల లభ్యత, మినహాయింపులపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు

### రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు







సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుదారులు కోరే సమాచారాన్ని పారదర్శకంగా, నిబంధనలకు లోబడి అందించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు స్పష్టం చేశారు. చట్టం పరిధిని, రికార్డుల లభ్యతను మరియు మినహాయింపులను పూర్తిగా అవగాహన చేసుకుని నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. సోమవారం కశింకోట పోలీస్ స్టేషన్లో ఆర్టిఐ అమలుపై రికార్డులు తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుదారులు నిబంధనల ప్రకారం సరిగ్గా అడిగినప్పుడు, ఆ రికార్డులు ఎక్కడ అందుబాటులో ఉన్నా సరే (ఎక్కడి నుంచైనా సేకరించి) చట్ట పరిధికి లోబడి వారికి లభించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చట్టం ప్రకారం ఏ సమాచారానికైతే మినహాయింపులు ఉన్నాయో, వాటిని స్పష్టంగా గుర్తించి నిబంధనలకు లోబడి మాత్రమే నిరాకరించాలని, చట్ట సమ్మతమైన మినహాయింపుల పరిధిని అధికారులు నిశితంగా పరిశీలించాలని సూచించారు. సమాచార హక్కు చట్టం యొక్క అసలు స్ఫూర్తి దెబ్బతినకుండా, ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన పారదర్శక సేవలను అందించడమే లక్ష్యంగా ప్రతి అధికారి పనిచేయాలని ఆదేశించారు.


# అరకు నియోజకవర్గంలో 95% ఓటర్లగా నమోదు...

## పరిశీలకులు బుద్ధ నాగ జగదీష్




కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఏంటిన్సివ్ రీజియన్ కార్యక్రమం జూలై 14 ఆఖరి రోజు కావడంతో అరుకు తెలుగుదేశం పార్టీ పరిశీలికలుగా నియమితులైన మాజీ ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు ఈరోజు అరకు నియోజకవర్గం ఇంచార్జ్ దన్నుదొర తో కలిసి సర్ ప్రక్రియను అనంతగిరి మండలంలో దన్నుదొర కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నాగ జగదీష్ మాట్లాడుతూ అరకు నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉన్నాయని పెదబయలు హుక్కంపేట అరకు వ్యాలీ ముంచంగి పుట్టు అనంతగిరి దుంబ్రిగూడ మొత్తం ఓట్లు 2,48,665 ఉన్నాయని, పెదబయలు లో 42,149 ఓటర్లు ఉన్నారని, 100/- పూర్తిగా నమోద చేశారని, హుకుంపేట మండలం 42,238 మంది ఓటర్లు ఉన్నారని 41,939 మంది ఓటర్లుగా బిఎల్వోలు నమోదు చేశారని 96.69 శాతంగా, ముంచింగు పుట్టు మండలంలో 42,239 మంది ఓటర్లు ఉన్నారని, బిఎల్వోలు 39,483 మంది వివరాలు 93.48 శాతంగా నమోదు చేయడం జరిగిందని, దుంబ్రిగూడ మండలంలో 39,438 మంది ఓటర్లు ఉన్నారని, దీనిలో ఇప్పటివరకు 38,041 మందిని ఓటర్లుగా నమోద కాగా 96.48 శాతం జరిగిందని, అనంతగిరి మండలంలో ఓటర్లు 38,464 ఉన్నారని, దీనిలో పూర్తి వివరాలు సేకరించిన వివరాలు 37,708 పూర్తి చేసి 98.03 శాతం చేశారని, అరకు వ్యాలీ లో 43,002 మంది ఓటర్లు గా ఉన్నారని దీనిలో ఇప్పటివరకు 37,545 మంది ఓటర్లుగా నమోదు చేయడం జరిగిందని 87.31 శాతం చేశారని మొత్తంగా అరకు నియోజకవర్గంలో 2,36,865 మందికి ఓటర్లుగా అర్హత వచ్చిందని 95.25 శాతం పూర్తి చేసిన తెలుగుదేశం జనసేన బిజెపి కార్యకర్తలు బూత్ లెవెల్ ఏజెంట్లుగా పనిచేసి బిఎల్వోలకి సహకరించడశీ వల్ల ఇది సాధ్యమైందని 14వ తేదీ కి శత శాతం పూర్తి చేయడానికి అందరూ కృషి చేసినందుకు అభినందనలు నాగ జగదీష్ దన్నుదొర తెలియజేశారు. అరకు నియోజకవర్గ ఇన్చార్జిగా దన్ను దొర పూర్తి బాధ్యత తీసుకొని కూటమి నాయకులతో సమన్వయం చేసుకొని 95% పూర్తి చేయడం అభినందనీయమని నాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి మండలం అధ్యక్షులు సుబ్బారావు జనసేన మండలం అధ్యక్షులు మురళి అరకు పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు జన్ని బాలరాజు అనంతగిరి మండలం తెలుగు మహిళా అధ్యక్షురాలు నిర్మల అనంతగిరి మండలం కస్టర్ ఇంచార్జ్ సందీప్ అనంతగిరి గ్రామపంచాయతీ అధ్యక్షులు మటన్ భీమన్న ఉపాధ్యక్షులు రంజిత్ ప్రధాన కార్యదర్శి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 15 న మెగా వైద్య శిబిరం...



తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ ఈనెల 15 బుధవారం జన్మదిన సందర్భంగా స్థానిక గవరపాలెం శ్రీశ్రీశ్రీ పెదరామ స్వామి యూత్ ఆధ్వర్యంలో అనిల్ నీరుకొండ హాస్పిటల్, తగరపువలస వారి సౌజన్యంతో పెదరామస్వామి కళ్యాణమండపంలో ఉచిత మెగా వైద్య శిబిరమును పాంప్లేట్లను నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ దాడి రత్నాకర్ జన్మదిన సందర్భంగా పేదలకు, పుర ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఈ వైద్య శిబిరం. శిబిరం నందు గుండె సంబంధిత వ్యాధులు, జీర్ణకోసవ్యాధులు, నరాల బలహీనత, కిడ్నీ వ్యాధులు, స్త్రీల ప్రసూతి వైద్యం, పిల్లల వైద్యం, ఎముకలు కీళ్ల వ్యాధుల వైద్యం, కంటి సమస్యలు, చెవి ముక్కు గొంతు సమస్యలు, ఊపిరితిత్తుల వ్యాధులు, చర్మవ్యాధులు, మానసిక సమస్యలు, దంత చికిత్స, మరియు ఇతర వైద్య సమస్యలను ప్రముఖ వైద్యులచే పరీక్షలు చేయబడును. ఈసీజీ, షుగర్, బిపి, కంటికి సంబంధించిన అన్ని రకాల పరీక్షలు, కంటి ఆపరేషన్ అవసరమైన వారికి ఆరోగ్యశ్రీపై ఉచిత కంటి ఆపరేషన్లు, మొదలగు పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన మందులు ఉచితంగా ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ పరీక్షల కోసం ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీని తీసుకొని రావలసి ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కొణతాల సత్యనారాయణ, బొడ్డేడ శంకర్రావు, కర్రి చిన్న అప్పలనాయుడు, కర్రి అప్పాజీ,కొణతాల గోపికృష్ణ, కోరుబిల్లి ఆరుద్ర, కోరిబిల్లి పర్రి , శిలపరశెట్టి బాబి, దాడి ఈశ్వరరావు, రేభక మధు, దొడ్డి రమణ, పొలిమేర నాయుడు, ఆళ్ల ప్రవీణ్ కుమార్, పోలమరిశెట్టి శివ అప్పారావు, సూరిశెట్టి బంగారు నాయుడు, కొలతల పరదేశి నాయుడు,ఆడారి రవికుమార్, అన్నం రాజశేఖర్, పోసర్ల రాజా, తాటికొండ జీవన్, తదితరులు పాల్గొన్నారు

## 'తెలుగు సినిమా.. హిందీ సినిమా' ఇదేం విభజన? – అడివి శేష్



భాషల ఆధారంగా సినిమాలను విభజించే విధానంలో మార్పు రావాల్సిన సమయం ఆసన్నమైందని హీరో అడివి శేష్ అభిప్రాయపడ్డాడు. దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకునే సినిమాలను ఒకే భాషకు పరిమితం చేయడం సరైన విధానం కాదన్నాడు. దేశమంతా ఆదరించే కథలకు భాష అడ్డంకిగా మారకూడదని అభిప్రాయపడ్డాడు.


ఇప్పటికీ 'హిందీ సినిమా', 'తెలుగు సినిమా', 'తమిళ సినిమా' అంటూ వేర్వేరుగా పిలుస్తూనే, మరోవైపు 'పాన్ ఇండియా సినిమా' అనే పదాన్ని ఉపయోగించడం ఆసక్తికరంగా అనిపిస్తోందని శేష్ చెప్పాడు. ఒక సినిమా దేశవ్యాప్తంగా ప్రేక్షకులతో భావోద్వేగ అనుబంధాన్ని ఏర్పరచగలిగితే దాని గుర్తింపును భాషతో ఎందుకు పరిమితం చేయాలని ప్రశ్నించాడు. కథలను భాషల గీతల్లో కాకుండా భారతీయ కథలుగా స్వీకరించినప్పుడే నిజమైన పాన్ ఇండియా సినిమా ఆవిష్కృతమవుతుందని అన్నాడు. భాష అనేది భావాలను వ్యక్తీకరించే సాధనం మాత్రమేనని, అది ఎప్పుడూ పరిమితిగా మారకూడదని అడివి శేష్ పేర్కొన్నాడు. ఇప్పుడు ప్రేక్షకులు గతంతో పోలిస్తే ఎంతో మారిపోయారని చెప్పాడు. మంచి కథ ఎక్కడి నుంచి వచ్చినా ఆదరిస్తున్నారని, ప్రేక్షకుల ఆలోచనా విధానానికి తగ్గట్టు సినీ పరిశ్రమ కూడా మారాల్సిన అవసరం ఉందన్నాడు. సినీ సృష్టికర్తల బాధ్యత నిజాయతీతో కూడిన కథలను అందరికీ చేరేలా రూపొందించడమేనని శేష్ అన్నాడు. ఒక భాష మార్కెట్‌ను మాత్రమే లక్ష్యంగా పెట్టుకోకుండా దేశం మొత్తం సొంతం చేసుకునే సినిమాలను రూపొందించాలన్నదే తమ లక్ష్యమని చెప్పాడు. ప్రస్తుతం అడివి శేష్ నటించిన 'డెకాయిట్: ఏ లవ్ స్టోరీ' విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటించింది. అనురాగ్ కశ్యప్, ప్రకాశ్‌రాజ్, సునీల్, జైన్ మేరీ ఖాన్, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషించారు. అలాగే 'గూఢచారి'కి సీక్వెల్‌గా తెరకెక్కుతున్న 'జీ2' చిత్రంలో కూడా అడివి శేష్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, వామికా, మధు శాలిని ఇతర ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు.

## ఐమాక్స్ ఫార్మాట్‌లో 'మహాకాళి'.. చివరి దశకు చిత్రీకరణ



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా రాబోతున్న మరో ప్రతిష్ఠాత్మక చిత్రం 'మహాకాళి'. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన 'హనుమాన్' తర్వాత వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. పూజ కొల్లూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే 125 రోజుల పాటు సుదీర్ఘంగా చిత్రీకరణ జరుపుకున్న 'మహాకాళి', ఇప్పుడు తుది షెడ్యూల్‌లోకి ప్రవేశించింది. ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్న ప్రముఖ బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నాతో పాటు యువ నటుడు రోహిత్ షరాఫ్ తమ పాత్రలకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తి చేసుకున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ మేకర్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రేక్షకులకు అత్యున్నత స్థాయి విజువల్ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని ఐమ్యాక్స్ (×హీూశ) ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తికావస్తుండటంతో, త్వరలోనే విడుదల తేదీతో పాటు మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్‌లను ప్రకటిస్తామని చిత్ర యూనిట్ వెల్లడించింది. 'హనుమాన్' యూనివర్స్‌లో రాబోయే ఈ కొత్త అధ్యాయం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# గ్లామర్‌తో కట్టేసిన నిధి అగర్వాల్




ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉంటూ తన గ్లామరస్ ఫోటోలతో అభిమానులను అలరిస్తూనే ఉంటుంది. తాజాగా ఈ భామ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన బ్లాక్ అవుట్‌ఫిట్ ఫోటోలు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. నలుపు రంగు దుస్తులలో నిధి ఒలకబోసిన అందాలు.. తన ఇంటెన్స్ లుక్స్ కుర్రకారు గుండెల్లో మంటలు రేపుతున్నాయి. ఈ లేటెస్ట్ గ్లామర్ ఫోటోలతో నిధి అగర్వాల్ మరోసారి సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. ఈ యంగ్ బ్యూటీ ఫోటోలను షేర్ చేసిన కేవలం 4 గంటల వ్యవధిలోనే లైకులు, కామెంట్ల వర్షం కురుస్తోంది. నిధి అందానికి ఫిదా అయిన నెటిజన్లు, అభిమానులు హార్ట్- బ్లాక్ హార్ట్- ఫైర్ ఎమోజీలతో కామెంట్ సెక్షన్‌ను పూర్తిగా నింపేస్తున్నారు. జార్జియస్ (అద్భుతంగా ఉన్నావు), -బ్యూటిఫుల్ బ్లాక్ క్వీన్- అంటూ నెటిజన్లు నిధి రూపానికి మురిసిపోతూ రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు. దీంతో ఈ ఫోటోలు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్‌పై క్షణాల్లో వైరల్‌గా మారాయ్. నిజానికి నిధి అగర్వాల్ కెరీర్ పరంగా ఇటీవల కాలం పెద్దగా కలిసిరాలేదనే చెప్పాలి. టాలీవుడ్ మోస్ట్ అవేటెడ్ పీరియాడిక్ డ్రామా.. పవన్ కళ్యాణ్ సరసన నటించిన ప్రతిష్టాత్మక చిత్రం -హరి హర వీర మల్లు-తో పాటు.. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన -రాజా సాబ్- చిత్రాల్లో నిధి కథానాయికగా మెరిసింది. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ఈ రెండు భారీ బడ్జెట్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయాన్ని చవిచూసి..ఈ ఏడాది బిగ్గెస్ట్ ఫ్లాపులుగా నిలిచాయి. అయితే బాక్సాఫీస్ వద్ద వరుసగా రెండు భారీ డిజాస్టర్లు పడినప్పటికీ నిధి అగర్వాల్ కెరీర్‌కు మాత్రం ఎలాంటి డోఖా లేదని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. సాధారణంగా స్టార్ హీరోల సినిమాల ఫ్లాప్ ఎఫెక్ట్ హీరోయిన్లపై పడుతుంది.. కానీ నిధి విషయంలో మాత్రం అది రివర్స్ అయింది. గ్లామర్ ప్రపంచంలో తనకున్న క్రేజ్, యూత్ ఫాలోయింగ్ కారణంగా ఇప్పటికీ పలు నిర్మాణ సంస్థలు, దర్శకులు తన వైపు మొగ్గు చూపుతున్నారు. సినిమాల ఫలితాలతో సంబంధం లేకుండా నిధి బ్రాండ్ వాల్యూ అలాగే స్థిరంగా కొనసాగుతోంది. ఇక 2026–27 సీజన్‌లో నిధి అగర్వాల్ తదుపరి ప్రాజెక్టుల విషయానికి వస్తే.. ఈ బ్యూటీ ప్రస్తుతం చాలా ఆచితూచి అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు అందుతున్న సమాచారం ప్రకారం.. భారీ డిజాస్టర్ల తర్వాత కొత్తగా ఏ తెలుగు సినిమాకు లేదా వెబ్ సిరీస్‌లకు అధికారికంగా సంతకాలు చేయలేదు. కథల ఎంపికలో ఈసారి పొరపాట్లు జరగకూడదనే ఉద్దేశంతో కాస్త గ్యాప్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కొన్ని క్రేజీ ప్రాజెక్టుల కథా చర్చలు నడుస్తుండగా... త్వరలోనే తన కొత్త సినిమాల వివరాలను ప్రకటించే అవకాశం ఉందని కథనాలొస్తున్నాయి.

## విజయ్ సేతుపతి 'ట్రైన్' వచ్చేస్తోంది.. రిలీజ్ ఆగస్టులోనే



'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి కథానాయకుడిగా, ప్రముఖ దర్శకుడు మిస్కిన్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ట్రైన్'. ఈ చిత్రాన్ని 2026 ఆగస్టులో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్. థాను అధికారికంగా ప్రకటించారు. చెన్నైలో ఇటీవల జరిగిన టీజర్ లాంచ్ కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఇటీవల విడుదలైన 43 సెకన్ల నిడివి గల టీజర్, చిత్రంపై అంచనాలను భారీగా పెంచింది. వేగంగా దూసుకెళ్తున్న 'బ్లూ మౌంటెన్ ఎక్స్‌ప్రెస్' రైలును కొంతమంది సాయుధులు తమ అధీనంలోకి తీసుకోవడం, ఆపదలో ఉన్న ప్రయాణికులను కాపాడేందుకు విజయ్ సేతుపతి చేసే వీరోచిత పోరాటం వంటి ఉత్కంఠభరిత సన్నివేశాలతో టీజర్‌ను ఆకట్టుకునేలా రూపొందించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత మాట్లాడుతూ, "ఈ సినిమాను ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం" అని పేర్కొనగా, దర్శకుడు మిస్కిన్ సరదాగా జోక్యం చేసుకుంటూ కచ్చితమైన తేదీని ప్రకటించాలని కోరారు. ఆగస్టు 14న మరో సినిమా ఉందంటూ ఆయన చమత్కరించడంతో సభలో నవ్వులు పూశాయి. ఈ చిత్రానికి కథ అందించడమే కాకుండా, మిస్కిన్ స్వయంగా సంగీతాన్ని సమకూర్చడం విశేషం. ఈ కథను ప్రత్యేకంగా విజయ్ సేతుపతి కోసమే సిద్ధం చేశానని, ఆయన తరహా నటనను కమల్ హాసన్, అమీర్ ఖాన్ వంటి దిగ్గజ నటులు సైతం ప్రదర్శించలేరని మిస్కిన్ ప్రశంసల వర్షం కురిపించారు. 2023లో ప్రారంభమైన ఈ చిత్రంలో శ్రుతి హాసన్, నాజర్, యుగి సేతు, నరైన్, కేఎస్ రవికుమార్, సంపత్ రాజ్ వంటి భారీ తారాగణం నటిస్తోంది. ఇందులో నరైన్ పోలీస్ అధికారిగా కనిపిస్తుండటంతో, ఇది మిస్కిన్ గత చిత్రం 'అంజాదే'కు కొనసాగింపు కావచ్చని, తద్వారా 'మిస్కిన్ సినిమాటిక్ యూనివర్స్'కు అంకురార్పణ జరుగుతోందని సినీ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఆగస్టులో చిత్ర విడుదల తేదీని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.

## "నాకిద్దరు కూతుళ్లు ఉన్నారు.. ఉద్యోగం ఇవ్వండి".. తండ్రి కష్టాలను గుర్తుచేసుకున్న భాగ్యశ్రీ బోర్సే



'లెనిన్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి భాగ్యశ్రీ బోర్సే. తాజాగా చిన్ననాటి జీవితంలోని కష్టాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేసింది. తాను పుట్టిన వెంటనే తండ్రి ఉద్యోగం కోల్పోయారని, ఆ తర్వాత కుటుంబం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెప్పింది. తమది దిగువ మధ్యతరగతి కుటుంబమని, చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు తమ కోసం ఎంత కష్టపడ్డారో కళ్లారా చూశానని తెలిపింది. ఇంట్లో ప్రతి రూపాయిని ఎంతో జాగ్రత్తగా ఖర్చు చేసేవారని భాగ్యశ్రీ చెప్పింది. రూ.10 పచ్చిమిర్చి, రూ.10 పాలకూర కొనుగోలు చేసిన వివరాలనూ నోట్‌బుక్‌లో రాసుకునేవారని, ఒక వారం రూ.300 ఖర్చయితే తర్వాతి వారం ఎలా గడపాలా అని తల్లిదండ్రులు ఆలోచించేవారని గుర్తు చేసుకుంది. చిన్నతనంలో డబ్బు విలువ తెలియకపోయినా, పెరిగేకొద్దీ తల్లిదండ్రుల కష్టాలు అర్థమయ్యాయని వివరించింది. తన జీవితంలో ఎన్నటికీ మర్చిపోలేని ఓ సంఘటనను భాగ్యశ్రీ గుర్తు చేసుకుంది. "నాకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.. దయచేసి నాకు ఉద్యోగం ఇవ్వండి" అంటూ తన తండ్రి ఒకరి వద్ద వేడుకున్నారని తెలిపింది. చిన్న వయసులో తండ్రిని ఆ స్థితిలో చూడటం చాలా బాధ కలిగించిందని చెప్పింది. అప్పుడే ఆయన మళ్లీ ఎప్పుడూ అలాంటి పరిస్థితిని ఎదుర్కోకూడదని నిర్ణయించుకున్నానని, జీవితంలో తాను సాధించాలనుకున్న ప్రతి లక్ష్యం వెనుక తల్లిదండ్రులే ప్రేరణగా ఉన్నారని వెల్లడించింది. ఔరంగాబాద్‌కు చెందిన భాగ్యశ్రీ బోర్సే కొంతకాలం నైజీరియాలో చదువుకుని, తర్వాత ముంబైలో మోడలింగ్ ప్రారంభించింది. బాలీవుడ్‌లో చిన్న పాత్రలతో కెరీర్ ప్రారంభించిన ఆమెకు రవితేజ సరసన నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. అనంతరం విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్, రామ్ పోతినేని వంటి హీరోలతో నటించింది. ఇటీవల అఖిల్ అక్కినేని సరసన నటించిన 'లెనిన్' సినిమాతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది.

## మూడో సినిమాతో వస్తున్న రోషన్ కనకాల.. ఈసారి సైన్స్ ఫిక్షన్‌తో ప్రయోగం!



రాజీవ్ కనకాల, సుమ దంపతుల కుమారుడు రోషన్ కనకాల తన మూడో సినిమాను అధికారికంగా ప్రారంభించాడు. 'బబుల్‌గమ్', 'మోగ్లి' చిత్రాలతో హీరోగా పరిచయమైనా, ఆ రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయాయి. ఈ నేపథ్యంలో, తన కెరీర్‌కు కీలకమైన మూడో సినిమా కోసం రోషన్ ఒక వినూత్నమైన సైన్స్ ఫిక్షన్ కథను ఎంచుకున్నాడు. ఈ చిత్రానికి ప్రయోగాత్మక సినిమాలకు పేరుగాంచిన దర్శకుడు విఐ ఆనంద్ కథ అందించడంతో పాటు సమర్పకుడిగా కూడా వ్యవహరిస్తున్నాడు. విజయ్ కె. కమ్మిశెట్టి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. బాలాజీ గుత్తా, కౌశిక్ రెడ్డి ఈ చిత్రానికి నిర్మాతలు. హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి యువ హీరో నిఖిల్ సిద్ధార్థ్ ముఖ్య అతిథిగా హాజరై తొలి క్లాప్ కొట్టాడు. ఈ సినిమాకు 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాలకు పనిచేసిన దిగ్గజ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ పనిచేస్తుండటం విశేషం. సైన్స్ ఫిక్షన్, రొమాంటిక్ కామెడీ, ఫాంటసీ అంశాలతో భారీ బడ్జెట్, ఉన్నత సాంకేతిక విలువలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో రోషన్ సరసన గహజీ షిజు కున్నత్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సత్య, సుదర్శన్, రవితేజ నన్నిమాల ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ వీఎఫ్ఎక్స్‌తో కూడిన ఈ హై-కాన్సెప్ట్ ఎంటర్‌టైనర్‌తో రోషన్ కమర్షియల్‌గా మంచి బ్రేక్ అందుకుంటాడని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ నెలాఖరు నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఇంకా టైటిల్ ఖరారు చేయని ఈ ప్రాజెక్ట్‌తోనైనా రోషన్ విజయం సాధిస్తాడేమో చూడాలి.







